284. హంసనాదం - దేశాది

బంటురీతి కొలు వీయ నయ్యరామ ॥బం॥

తుంట వింటివాని మొదలైన మదా
దులఁ బట్టి నేలఁగూలఁ జేయు నిజ ॥బం॥

రోమాంచమనే వరకంచుకము
రామభక్తుడనే ముద్రబిళ్ళయు
రామనామ మనే వీరఖడ్గమిచ్చి
రాజిల్లునట్లు త్యాగరాజునికి ॥బం॥

తుంట వింటి వాని మొదలైన = కామము క్రోధము మదము మొదలగువాటిని. రోమాంచము = గగుర్పాటు-కంచుకము = కవచము.

భగవద్భక్తికి సేవాధర్మము అతిముఖ్యము. అందును దాస్యము విశిష్టమైనది. ఇందు శ్రీరామ ప్రభువు దర్బారులో రామబంటుగా నాకు కొలువును అనుగ్రహించమని వేడినాను. నిరంతరము శ్రీవారి సన్నిధిలో జవాను ఉద్యోగమిప్పించమనిరి.

ఇట్లు నిరంతర సేవలో కామ క్రోధ మదాదులు నశించును. ప్రతిక్షణమందును తన ప్రభువు కనుసన్నలలో మెలఁగవలసియుండును.

ఏమరపాటున కవకాశముండదు. ప్రభు ఆస్థాన గౌరవముండును. ఆ కొలువులో తానుచేసి, చేయని కర్తవ్యమునకు పరిగణనముండదు. తన సర్వవిధులు రామాంకితములయ్యేయుండును. అందుకు తగిన వేషభాషాలంకారములను చరణమందు రూపొందించుకొన్నారు.

నిరంతర శ్రీరామస్మరణ కీర్తనాదులచే తనకు కలిగిన గగుర్పాటు కంచుకపుట. మెడలో ధరించు డవాలుపై "రామభక్తుడు" అని ముద్రించిన బిళ్ళ, ఇది అధికార చిహ్నము. రామనామమనే డాల్. (కత్తి) ఇవి రాజిల్లునట్లు త్యాగరాజునికి ఉద్యోగమిమ్ము. ఈ యుద్యోగము కాలాంతర లోకాంతరములందు సైతము శాశ్వతము, అజరామరము. ఇందుకు ప్రతిఫలము బ్రహ్మానందమే. శాస్త్రములందు భగవదను సంధానమునకు సాధకునికి అనేక ప్రక్రియలుకలవు. ఈ విధమైన సంవిధానము శ్రీ త్యాగరాజుని అంతరంగమం దేర్పడుట, వారి ఆంతరంగిక నైజ స్వభావము, కేవల దైవానుగ్రహ హేతుకమని తెలియుచున్నది. ఈ యనుసంధానము వైదిక, లౌకిక సత్సాధనలకొక వారధివంటిది. ఈ భావ సమాధి నిరుపమానమైనది.

Scanned with CamScanner